సాక్షి
మహబూబాబాద్
ఆదివారం | 11 | ఫిబ్రవరి | 2024



మొరాయిస్తే వెంటనే మరమ్మతు

మేడారం జాతరలో ఆర్టీసీ బస్సుల వైఫల్యాలకు తావులేకుండా యాజమాన్యం, అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

- 8లో▸



అపరాలు.. ఆరోగ్యకరం

అపరాలతో తయారు చేసిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36.5^0 / 21.6^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ చలితో పాటు కాస్త మంచు కురుస్తుంది.

గ్యారంటీ బడ్జెట్

సామాన్యులకు లబ్ధి చేకూరేలా రాష్ట్ర బడ్జెట్

- నెరవేరనున్న పేదల సొంతింటి కల
- రైతుల రుణమాఫీకి నిధులు
- మున్సిపాలిటీలు, పంచాయతీలకు కేటాయింపులు
- బడ్జెట్‌పై జిల్లా ప్రజల మిశ్రమ స్పందన



సాక్షి, మహబూబాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేద, మధ్య తరగతి వర్గాలకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు స్పష్టమైంది. ఆరు గ్యారంటీ పథకాల అమలే ధ్యేయంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది. కాగా రైతులు, మహిళలు, నిరుద్యోగులకు లాభం చేకూరే బడ్జెట్ ఉంది.

ఆరు గ్యారంటీలు..

ఎన్నికల ప్రధాన హామీ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు బడ్జెట్‌లో నాల్గొవంతు రూ.53,196కోట్లు కేటాయించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణ సౌకర్యం కల్పించింది. అలాగే రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. మిగిలిన పథకాలను కూడా అమలు చేస్తామని ప్రకటించింది. గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించగా.. జిల్లావ్యాప్తంగా 3,09,620 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఉచిత విద్యుత్, రూ.500గ్యాస్, రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులున్నాయి. వచ్చిన దరఖాస్తులను అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తోంది. ఈ పరిశీలన పూర్తయిన తర్వాత హామీలు ఒక్కొక్కటిగా అమలు కానున్నాయి.

కొత్త భవనాలు

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి నిధులు కేటాయింపులు జరిగాయి. ఇందులో భాగంగానే సంక్షేమ పాఠశాలలకు భవనాలు నిర్మిస్తామని మంత్రి భట్టివిక్రమార్క పేర్కొనారు. అయితే జిల్లాలో అన్ని రకాల సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు 31 ఉండగా ఇందులో 16 అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి కొత్త భవనాలు నిర్మించే అవకాశం ఉంది.



మండలానికో పబ్లిక్ స్కూల్



విద్యారంగం అభివృద్ధిలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలో ప్రతి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నిర్మించనున్నారు. కాగా ప్రతి జిల్లాలోని కొన్ని మండలాల్లో పైలెట్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకొసం బడ్జెట్‌లో రూ.500కోట్లు కేటాయించారు. ఈ లెక్కన జిల్లా కేంద్రానికి దూరంలో ఉన్న మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని స్కూల్స్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే మెగా డీఎస్సీ వేస్తామని పేర్కొనడంతో.. జిల్లాలోని బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

నెరవేరనున్న సొంతింటి కల



కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా చెప్పిన విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. జనవరిలో ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 3,09,620దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధిక శాతం ఇళ్లు కావాలని దరఖాస్తులు అందజేశారు. కాగా ఇంటి స్థలం లేని వారికి స్థలం, సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు కేటాయించనున్నారు. దీంతో నిరుపేదల సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. అయితే నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పేర్కొన్నారు. ఇలా జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు పాలకుర్తి, ఇల్లెందు, ములుగు నియోజకవర్గాల నుంచి దాదాపు పదివేల ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

రైతుల రుణమాఫీ..



జిల్లాలో 2,30,000 మంది రైతులు ఉంటారు. ఇందులో జిల్లాలోని 13 బ్యాంకుల పరిధిలో 1,17,363 మంది రైతులు రూ.495 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నారు. గత ప్రభుత్వం రైతుల రుణమాఫీ ప్రకటించి వారి ఖాతాల్లో డబ్బు జమ చేసింది. ఇలా నాలుగు విడతలుగా మొత్తం 44,932 మందికి రూ. 2,44కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. మిగిలిన 72,431మందికి సంబంధించి రూ. 251కోట్లు పడాల్సి ఉంది. ఎన్నికల ముందు రుణమాఫీ అయిన రైతులు తిరిగి రుణాలు తీసుకున్నారు. కాగా రూ.2లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేసేందుకు నిధులు కేటాయించడంతో జిల్లాలో రూ.1,300కోట్ల మేరకు రుణాలు మాఫీ అయ్యే అవకాశం ఉంది.

మున్సిపాలిటీలు, జీపీలకు నిధులు



గ్రామం యూనిట్‌గా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లాలోని 461గ్రామ పంచాయతీల్లో మరింత అభివృద్ధి జరగనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు ప్రత్యేకంగా రూ.40,080 కోట్లు కేటాయించింది. కాగా జనాభా ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధులు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.11వేల కోట్ల పైచిలుకు నిధులు పురపాలక శాఖకు కేటాయించడంతో జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడంతో పాటు కొత్త పనులు చేపట్టనున్నారు.

ప్రజలందరికీ ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంది. ప్రజల అభీష్టం మేరకు బడ్జెట్ ఉన్నప్పుడు విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, కార్మికులకు మేలు కలుగుతుంది. సంక్షేమం, అభివృద్ధితో కూడిన బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. విద్య, ఉపాధి, సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించడానికి బడ్జెట్ దోహదపడుతుంది.

– చెరివిరాల ప్రభాకర్, వ్యాపారి, మానుకోట

రైతు, నిరుద్యోగ భరోసా బడ్జెట్

ధరణి పోర్టల్ ప్రక్షాళన, రూ.2లక్షల రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించడం, అదే విధంగా రోడ్లు, కొండలు, గుట్టలు, బీడు భూములకు సాగు చేయని భూస్వామ్య వ్యవస్థకు రైతుభరోసా నిలిపివేయడం మంచి నిర్ణయం. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనతో పాటు నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం ఉద్యోగ క్యాలెండర్ ఇస్తామనడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అర్హులైన వారికి రూ. 5 లక్షలు ప్రకటించడం శుభపరిణామం. ఉద్యోగులపై కూడా ప్రభుత్వం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం.



– బానోత్ బొంద్యాలు, మహబూబాబాద్

విద్యకు సముచిత కేటాయింపులు జరగలేదు



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యకు ఎక్కువ నిధులు కేటాయిస్తుందని అందరూ భావించారు. కానీ సముచితంగా నిధుల కేటాయింపులు జరగలేదు. పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు సరిపోవు. మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేది.

– మైన శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

మహిళలకు పెద్దపీట..



రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట వేశారు. ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రానున్న కాలంలో మహిళలకు మరెన్నో పథకాలు ప్రవేశపెట్టాలి. వడ్డీలేని రుణాలు అందించాలి.

– ఆరెంపుల విజయ, గృహిణి, మహబూబాబాద్

కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయి..



గుణాత్మకమైన ఆర్థికవృద్ధి సాధనకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఉపయోగకరంగా ఉంటుంది. మౌలిక రంగాలైన విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కేటాయింపులు మెరుగ్గా ఉన్నాయి. తలసరి ఆదాయం పెరుగుతున్నా.. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తగ్గించడానికి మూలధన వ్యయ కేటాయింపులు పెంచాల్సి ఉంటుంది. బడ్జెట్‌లో పలు రంగాలకు సమతుల్యంగా నిధులు కేటాయించారు.

– శ్రీరంగం నర్సింహారావు, మహబూబాబాద్

న్యూస్‌రీల్

'గృహజ్యోతి' సర్వే తనిఖీ



కేసముద్రం: మండల కేంద్రంలో గృహజ్యోతి పథకం కింద స్థానిక అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈమేరకు సర్వే కార్యక్రమాన్ని డీఈ విజయ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అధికారుల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సర్వీస్ నంబర్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్, ప్రజాపాలన దరఖాస్తు రశీదును సర్వే అధికారులకు చూపించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



కేసముద్రం: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు జిల్లాలోని స్కూల్ గేమ్స్ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా జిల్లా సెక్రటరీ జ్యోతి, కొమ్ము రాజేందర్, ఐలయ్య, ప్రభాకర్, తెలంగాణ సమగ్ర శిక్ష ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.నసీరుద్దీన్ పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో కలిసి ఈవీఎం నోడల్ అధికారి తిర్థెవల్ శనివారం పరిశీలించారు. వారివెంట అదనపు కలెక్టర్ డేవిడ్, ఏఓ వెంకటరమణ,అధికారులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మహబూబాబాద్ రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ రమాదేవి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మానుకోట మండలంలోని పర్వతగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం పదో తరగతి విద్యార్థులు చదువుతో పాటు మేధోశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతీవిద్యార్థి అన్ని సబ్జెక్టులపై పట్టుసాధించాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఏసీ జీఈ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలు

మహబూబాబాద్: జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లను బదిలీ చేస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మానుకోట నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఏడుగురు తహసీల్దార్లు బదిలీ కాగా.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల నుంచి ఏడుగురు మానుకోటకు బదిలీ చేశారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ తహసీల్దార్ సాదియా సుల్తానా, జుల్లూరుపాడ్ తహసీల్దార్ శారద, పాల్వంచ తహసీల్దార్ సీహెచ్. నాగరాజు, టేకులపల్లి తహసీల్దార్ కృష్ణవేణి, ఖమ్మం జిల్లా ఆర్డీఓ కార్యాలయ డీఏఓలు(తహసీల్దార్ క్యాడర్) శైలజ, శ్వేత, ములుగు కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్(తహసీల్దార్ క్యాడర్) సీహెచ్.రవీందర్‌ను జిల్లాకు బదిలీ చేశారు.

జిల్లా నుంచి..

జిల్లాలోని నర్సింహులపేట తహసీల్దార్ వివేక్, బయ్యారం తహసీల్దార్ ఇమ్మానియేల్, డోర్నకల్ తహసీల్దార్ నాగభవాని, గార్ల తహసీల్దార్ స్వాతి బిందు, గూడూరు తహసీల్దార్ అశోక్ కుమార్, ఇనుగుర్తి తహసీల్దార్ సూర్యనారాయణ, సీరోలు తహసీల్దార్ నరేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు.

నులిమేద్దాం..

నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ

- జిల్లాలో 1.76 లక్షల మంది పిల్లలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

జిల్లాలో పిల్లల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–5 సంవత్సరాలు	36,468
పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు	63,831
6 నుంచి 10వ తరతగతి వరకు	62,786
జూనియర్ కళాశాలలు	12,490
బడి, కళాశాల బయటి పిల్లలు	531
అంగన్‌వాడీలకు రాని పిల్లలు	490

నెహ్రూసెంటర్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. సంవత్సరం నుంచి 19ఏళ్ల పిల్లలకు ఈ మాత్రలు అందజేస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో 1,76,596మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించి వైద్యాధికారులు మాత్రల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈ నెల 20న..

ఈ నెల 20 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పంపిణీ చేయనున్నారు. ఆ రోజున వేసుకోని విద్యార్థులకు ఈ నెల 27న వేయనున్నారు.

ఏడాదికి రెండుసార్లు..

పిల్లల్లోని నులిపురుగులను నివారించేందుకు ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నారు. కాగా సంవత్సరం నుంచి రెండేళ్ల పిల్లలకు సగం టాబ్లెట్, ఆపై నుంచి 19 ఏళ్ల పిల్లలకు మొత్తం మాత్రం వేస్తారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ప్రతి ఒక్కరికీ వేసేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారులు తెలుపుతున్నారు.

జాగ్రత్తలు ఇలా...

ఆల్బెండజోల్ మాత్రలు వేసిన వెంటనే పిల్లల్లో వాంతులు, విరోచనాలు అవుతున్నట్లు గుర్తిస్తే పిల్లల్ని నీడలో పడుకోబెట్టాలి. వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయవద్దు. అదే విధంగా పిల్లలకు కూడా బలవంతంగా మాత్రలు వేయకూడదు.

లక్షణాలు..

- నులి పురుగులు ఉన్న పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుంది
- నులిపురుగులు ఉంటే నీరసంగా ఉంటారు
- రాత్రిపూట నిద్రపోపట్టదు.. తరచూ కడుపు నొప్పి రావడం
- పిల్లల్లో మలబద్ధకం ఏర్పడుతుంది

పిల్లలందరికీ మాత్రలు వేయాలి



నులిపురుగుల నివారణకు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి. 1–19 సంవత్సరాల వయసు గల పిల్లలకు తప్పనిసరిగా వేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మాత్రలు వేయడం వల్ల పిల్లల్లో ఎదుగుదల పెరుగుతుంది.

– విజయ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి


నేటినుంచి డిగ్రీ తరగతులు

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ మొదటి సంవత్సరం కాంట్రాక్టు కౌన్సెలింగ్ తరగతులు ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెర్నర్ సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ అలువాల సంజీవయ్య తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. అలాగే, డిగ్రీలో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పెంచినట్లు అలువాల సంజీవయ్య తెలిపారు.

ఎక్కడ ఏముందో..?

- మేడారం వచ్చే భక్తులకు అణువణువూ తెలిసేలా చర్యలు
- జాతరలో డ్రోన్‌తో సర్వైలెన్స్ సర్వే
- వీడియోలు, ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్

ఏటూరునాగారం: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అణువణువూ తెలిసే విధంగా ఎస్పీ శబరిష్ ఆదేశాలతో పోలీసు సిబ్బంది డ్రోన్‌తో సర్వైలెన్స్ సర్వే చేపట్టారు. పస్రా నుంచి మొదలుకొని తాడ్వాయి మీదుగా మేడారం వరకు రోడ్డు, పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెలు, జంపన్నవాగుతోపాటు అనేక ప్రాంతాలను సర్వేలో నిక్షిప్తం చేశారు. డ్రోన్ ద్వారా ఎక్కడ ఏ ప్రదేశం ఉందని ఏరియల్ వ్యూ తీశారు. జాతరకు వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, సాధారణ భక్తులలకు సైతం రోడ్డు మ్యాప్, పార్కింగ్ స్థలాలు, రోడ్డు ఎటు నుంచి వెళ్తుందనే విధంగా చిత్రీకరించారు. ఆ వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్, తదితర గ్రూపుల్లో పంపించనున్నారు.




ఒక్కో పార్కింగ్‌కు కోడ్

జాతర చుట్టూ పక్కల ఇటు తాడ్వాయి, అటు పస్రా నార్లాపూర్, ఊరట్టం, కొండాయి ఈ ప్రాంతాల నుంచి మేడారం జాతరకు ఎలా చేరుకుకోవాలనే ఉద్దేశంతో ఒక్కో పార్కింగ్ కోడ్‌ను కేటాయించారు. ఏ1, ఏ2, సీ1, సీ2 ఇలా నంబర్లు ఇస్తూ అడ్రస్‌లను ల్యాండ్ మార్కింగ్స్ కూడా ఇవ్వనున్నారు. దీనివల్ల వారి కుటుంబ సభ్యులు ఏ ప్రాంతంలో ఉందనేది సులభంగా తెలిసిపోయే విధంగా ఈ సర్వైలెన్స్ సర్వే చేపట్టారు.

అలాగే మేడారంలో విధులు నిర్వర్తించే పోలీస్ ఉన్నతాధికారులనుంచి కింది స్థాయి సిబ్బందికి సైతం ఈ వీడియోలు, ఫొటోలను షేర్ చేస్తూ భక్తులకు అవగాహన కల్పించనున్నారు. జాతర ఈనెల 21 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండడంతో సహాయక అధికారుల నంబర్లను కూడా పొందుపర్చనున్నారు. ఈ సర్వైలెన్స్ సర్వే వల్ల జాతరకు భక్తులు సులభంగా వచ్చిపోయే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



డ్రోన్‌తో రూట్ సర్వైలెన్స్ సర్వే చేపడుతున్న పోలీసులు సిబ్బంది



డ్రోన్ ద్వారా తీసిన జంపన్నవాగు ఏరియల్ వ్యూ

పౌష్టికాహారం తీసుకోవాలి



చేపల కర్రీ సెంటర్‌ను పరిశీలిస్తున్న నాగమణి

తొర్రూరు: అన్నివర్గాల ప్రజలు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి అల్లు నాగమణి సూచించారు. శనివారం డివిజన్ కేంద్రంలోని చేపల మార్కెట్, చేప కర్రీ విక్రయాల సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని మాంస ఆహారాల కంటే చేపలు ఎంతో ఆరోగ్యకరమని, వాటితోపాటు ప్రతి వ్యక్తి చెడు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆకు కూరలు, పండ్లు మాత్రమే స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొత్తూరు రమేష్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

పచ్చదనంతో కళకళలాడాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నెల్లికుదురు: గ్రామాలు పచ్చదనంతో కళకళలాడాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పో అధికారులను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని నర్సింహులగూడెం గ్రామాన్ని శనివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పల్లె దవాఖానను సందర్శించి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ శేషాద్రి, ఎంపీడీఓ పార్థసారథి, కార్యదర్శి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘డైట్‌’ సర్టిఫికెట్ల పరిశీలన

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని డైట్‌ సెట్‌–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఫేజ్‌ 1, 2లలో హాజరుకాని వారు తమ సర్టిఫికెట్ల పరిశీలనకు ఈనెల 14న హనుమకొండలోని ప్రభుత్వ డైట్‌ కళాశాలలో ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్‌ నారాయణరెడ్డి తెలిపారు. మొదటి, రెండో దశలో వెబ్‌ ఆప్షన్‌ ఇవ్వని అభ్యర్థులు ఈనెల 15నుంచి 17వరకు వెబ్‌ ఆప్షన్లు ఇవ్వవచ్చని తెలిపారు. 22న సీట్ల కేటాయింపు ఉంటుందని, సీటు వచ్చిన అభ్యర్థులు ఈనెల 23 నుంచి 26 తేదీల మధ్య ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు.

18న జిల్లాస్థాయి చెస్‌ టోర్నీ

వరంగల్‌ స్పోర్ట్స్‌ : వరంగల్‌ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి ర్యాంకింగ్‌ చెస్‌ టోర్నీ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కన్నా శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చెస్‌ అసోసియేషన్‌ సహకారంతో హనుమకొండ పబ్లిక్‌ గార్డెన్‌ ఎదురుగా ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సన్మానం



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న డీఈఓలు, జీటీఏ బాధ్యులు

కాశీబుగ్గ సెంటర్‌ : ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) ఆధ్వర్యంలో వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి సన్మానించారు. ముఖ్య అతిథులుగా వరంగల్‌ డీఈఓ వాసంతి, హనుమకొండ డీఈఓ అబ్దుల్‌హై హాజరై హెచ్‌ఎంలను అభినందించారు. కార్యక్రమంలో జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్‌, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి, కోశాధికారి సపావత్‌ నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రవి, అసోసియేట్‌ అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్‌, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం, గౌరవ అధ్యక్షుడు పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మొరాయిస్తే వెంటనే మరమ్మతు

మేడారం జాతరలో బస్సుల వైఫల్యాలకు తావు లేకుండా చర్యలు




మేడారంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌

- 12మొబైల్‌ టీంల ఏర్పాటు
- నాలుగు మెయింటెనెన్స్‌ క్యాంపులు
- అన్ని విధాలుగా సిద్ధమవుతున్న ఆర్టీసీ

హన్మకొండ : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో ఆర్టీసీ బస్సుల వైఫల్యాలకు తావులేకుండా టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మహా జాతరకు ఈ నెల 18 నుంచి ఆర్టీసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు 57 పాయింట్ల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక ఖరారు చేసింది. కాగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన క్రమంలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వచ్చిన భక్తులు వచ్చినట్లుగా వెనువెంటనే చేర వేసేందుకు ఈ సారి ఆరు వేల ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. 18వ తేదీనాటికి వరంగల్‌ రీజియన్‌కు బస్సులు చేరుకునేలా షెడ్యూల్‌ ఖరారు చేశారు. కాగా ఆర్టీసీ బస్సులు మార్గమధ్యలో ఆగినా, ఫెయిలైనా, ఇతరత్రా మరమ్మత్తులు వచ్చినా భక్తులు ఏ మాత్రం అసౌకర్యానికి గురి కాకుండా ఉండేందుకు వెంటనే మరమ్మతు చేసేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు మొబైల్‌ టీమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక మెయింటెనెన్స్‌ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్‌ రద్దీ అధికంగా ఉండి నాలుగు చక్రాల వాహనాలు వెళ్లలేని పరిస్థితుల్లో సులువుగా చేరుకునేందుకు ద్విచక్ర వాహనాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులో మొబైల్‌ టీములు

జాతరలో మొత్తం 12మొబైల్‌ టీంలు ఏర్పాటు చేస్తున్నారు. మేడారం, తాడ్వాయి. పస్రా, గణపురం, జంగాలపల్లి, గట్టమ్మ, గూడెప్పాడ్‌, కాటారం, నార్లాపూర్‌, కామారం పార్కింగ్‌, కొండపర్తితో పాటు హనుమకొండలో మొబైల్‌ టీములు అందుబాటులో ఉంటాయి. వీరికి కేటాయించిన పరిధిలో బస్సులు ఫెయిలైనా, ఇతరత్రా సాంకేతిక సమస్యలు వచ్చినా వెంటనే చేరుకుని మరమ్మతు చేసి పంపిస్తారు. బృందంలో ఇద్దరు మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్‌ ఉంటారు. అక్కడ మరమ్మతు కాకపోతే నిలిచిపోయిన బస్సును తరలించడానికి ప్రత్యేకంగా క్రేన్‌, ట్రాక్టర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. ప్రత్యేక మెయింటెనెన్స్‌ క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రిషియన్‌ల చొప్పున ఉంటారు.



పెట్రోలింగ్‌ టీములు

మార్గమధ్యలో బస్సులు ఇతరత్రా కారణాలతో నిలపకుండా ఉండేందుకు, ట్రాఫిక్‌లో చిక్కుకున్న వెను వెంటనే తరలించేందుకు 15 పెట్రోలింగ్‌ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ పెట్రోలింగ్‌ టీమ్‌లు వారికి కేటాయించిన ప్రాంతం (సెక్టార్‌)లో నిరంతరాయంగా పర్యటిస్తూ బస్సుల రాకపోకలను పర్యవేక్షిస్తారు. ఇందులో ఓ అధికారి, సెక్యూరిటీ ఉంటారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. భక్తులను క్షేమంగా, సురక్షితంగా చేరవేయడమే మా ధ్యేయం. మార్గమధ్యలో బస్సులు మరమ్మతుకు వచ్చినా వెంటనే రిపేర్‌ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి సమస్య ఎదురైనా సులువుగా అధిగమించేందుకు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

–జాన్సి శ్రీలత, ఆర్టీసీ, వరంగల్‌ ఆర్‌ఎం

అపరాలు.. ఆరోగ్యకరం

- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌ ఆర్‌.ఉమారెడ్డి

హన్మకొండ : అపరాలతో తయారు చేసిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అపరాల సాగు పెంచాల్సిన అవసరం ఉందని వరంగల్‌ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌ ఆర్‌.ఉమారెడ్డి అన్నారు. శనివారం వరంగల్‌ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రపంచ అపరాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను హనుమకొండ జిల్లా కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ను కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. అదే విధంగా వరంగల్‌ పోలీసు కమిషనర్‌కు, జిల్లా వ్యవసాయాధికారి ఉషా దయాళ్‌కు, హనుమకొండ ఏడీఏ దామోదర్‌ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులకు అందజేసి అపరాలపై అవగాహన కల్పించారు. అలాగే ములుగు రోడ్డులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎదుట ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి బాటసారులకు, బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులకు అపరాల తినుబండారాలు అందించి చిరుధాన్యాల సాగు అవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌.ఉమారెడ్డి మాట్లాడుతూ అపరాల సాగు విస్తీర్ణం పడిపోవడం బాధాకరమన్నారు. అపరాలలో అనేక పోషకాలుంటాయని, ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ముఖ్యంగా పప్పు దినుసులు తినడం ద్వారా అవసరమైన ప్రొటీన్లు పొందవచ్చన్నారు. ఏడీ డాక్టర్‌ వెంకట్‌ రెడ్డి, శాస్త్రవేత్తలు ఎస్‌.సంధ్యారాణి, దిలీప్‌, జి.వీరన్న, వి.వెంకన్న, ఎం.మధు. జి.పద్మజ, డి.వీరన్న పాల్గొన్నారు.



చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను కలెక్టర్‌కు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మేడారంలో మెండుగా మొక్కులు

వనదేవతలను దర్శించుకున్న భక్తులు



వనదేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఏటూరునాగారం : మేడారంలోని సమ్మక్క–సారలమ్మలకు భక్తులు శనివారం మెండుగా మొక్కులు సమర్పించారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన కల్యాణకట్ట వద్ద తలనీలాలను సమర్పించి తలస్నానాలు ఆచరించారు. అనంతరం ఎత్తుబంగారంతో వనదేవతల వద్దకు చేరుకొని తల్లిబిడ్డకు మొక్కులు సమర్పించారు. పగిడిద్దరాజు, గోవింద రాజులకు కానుకలు చెల్లించారు. ఒడిబియ్యం అమ్మవారికి అప్పగించారు. గద్దెలపై ఉన్న బంగారం(ప్రసాదంగా) తీసుకొని వెనుదిరిగారు. రద్దీ లేకపోవడంతో అధికారులు భక్తులను గద్దెలపైకి అనుమతి ఇచ్చారు. దీంతో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కంకవనాల్లో వంటలు చేసుకొని సంహపక్తి భోజనాలు చేశారు. జంపన్నవాగు, బస్టాండ్‌ నుంచి ఆటోలు నడపడంతో భక్తులకు నడకబాధలు తప్పాయి. పోలీసులు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌ను మళ్లించారు.



గద్దెల వద్ద సిద్ధం చేసిన హుండీలు

మేడారం జాతరకు గవర్నర్‌ రాక..

ఏటూరునాగారం : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు గవర్నర్‌ తమిళిసై రానున్నార ని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ ఇలా త్రిపాఠి శనివారం అధికారులను ఆదేశించారు. ఈనెల 21నుంచి మేడారం జాతర ప్రారంభం కానుందని, గవర్నర్‌ స్వయంగా వనదేవతలకు మొక్కులు చెల్లించనున్నట్లు తెలిపారు. అయితే పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదన్నారు. అంతేకాకుండా వీవీఐపీలు వచ్చే అవకాశం ఉందని, ప్రొటోకాల్‌ ప్రకారం కావాల్సిన మర్యాదలు, ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలకు లోబడి పనులు చేయించాలన్నారు. నాలుగు పకోడ టెంట్లను ఏర్పాటు చేయడం, ఐటీసీ నుంచి ప్రత్యేక కంటైనర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, దేవాదాయ, పంచాయతీ రాజ్‌ శాఖ అధికారులు గద్దెల వద్ద నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య, ఎండోమెంట్‌ ఈఓ రాజేందర్‌, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, సారలమ్మ పూజారి వెంకటేశ్వర్లు ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్‌



ఎత్తు బంగారం(బెల్లం)తో వస్తున్న భక్తులు

రేషన్‌ బియ్యం స్వాధీనం

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్‌ బియ్యాన్ని శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అనిల్‌కుమార్‌ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కాగా యజమాని గోలి సంతోష్‌ పీడీఎస్‌ బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని సన్న బియ్యంగా మారుస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్రమంగా నిల్వ చేసిన 133 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. సివిల్‌ సప్లై డీటీలు శ్రీనివాస్‌, దేవా విచారించి బియ్యాన్ని సీజ్‌ చేసి గోదాంకు తరలించారు. యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం గుండెపుడికి చెందిన ఒకరు, తండధర్మారం గ్రామానికి చెందిన ఒకరు, జనగామ జిల్లా తరిగొప్పుల మండలానికి చెందిన ఒకరు, నర్మెట మండలానికి చెందిన ఓ యువకుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో, మేడారం జాతరకు వెళ్తూ ఒకరు మృతిచెందారు.

అత్తారింటికి వెళ్లి వస్తూ..అనంత లోకాలకు..

- స్కూల్‌ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి




శంకర్‌ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



శంకర్‌ (ఫైల్‌)

మరిపెడ రూరల్‌ : అత్తారింటికి వెళ్లి వస్తూ మార్గమధ్యలో స్కూల్‌ బస్సు ఢీకొట్టగా ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివారు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన బాదావత్‌ శంకర్‌ (27) బొడ్రాయి పండుగ సందర్భంగా తన అత్తగారి గ్రామం సూర్యాపేట జిల్లా నూతనకల్‌ మండలం కందగట్ల గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. కాగా మిర్చితోటకు పురుగు మందు పిచికారీ చేసి తిరిగి అత్తారింటికి వెళ్లాలని స్వగ్రామమైన గుండెపుడికి బయలుదేరి వస్తున్నాడు. మండలంలోని బుర్హాన్‌పురం శివారులో మండలంలోని శ్రీవెంకటేశ్వర మెమోరియల్‌ (ఎస్వీఎం) పాఠశాలకు చెందిన బస్సు తానంచర్ల వైపుగా వెళ్తోంది. ఎదురుగా వస్తున్న శంకర్‌ బైక్‌ అదుపుతప్పి స్కూల్‌ బస్సును ఢీకొట్టాడు. దీంతో శంకర్‌ ముఖం, తలకు తీవ్రగాయాలైన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఆరునెలల కుమారుడు ఉన్నాడు. సంఘటన స్థలాన్ని మరిపెడ రెండోఎస్సై మౌలాన సిబ్బందితో చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు..



మద్దోజు నరేష్‌ మృతదేహం

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలో మహబూబాబాద్‌–సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన మద్దోజు నరేష్‌(35), గుగులోత్‌ మంగీలాల్‌తో కలిసి సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై మరిపెడకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మంగీలాల్‌ కంట్లో దోమ పడడంతో వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపారు. కాగా మరిపెడ నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన దాసరి మహేందర్‌ తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. దీంతో బైక్‌ అదుపు తప్పి ముందు ఆగి ఉన్న మంగీలాల్‌ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బైక్‌పై కూర్చొని ఉన్న మద్దోజు నరేష్‌ కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన గుగులోతు మంగీలాల్‌, దాసరి మహేష్‌ను 108 వాహనం ద్వారా మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



బాలయ్య (ఫైల్‌)

తరిగొప్పుల : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలో జరిగింది. ఎస్సై నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం .. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని బొంతగట్టునాగారం గ్రామానికి చెందిన సుంకరి బాలయ్య(57) వ్యక్తిగత పనుల నిమిత్తం బొత్తలపర్రె గ్రామానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో హుస్నాబాద్‌–జనగామ ప్రధాన రహదారిపై ఏడుపోచమ్మలగుడి కూడలి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరు..



భూక్య జానకిరాం (ఫైల్‌)

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలోచోటుచేసుకంఉది. జనగామ జిల్లా నర్మెట మండలం గండిరామవరం పరిధిలోని మనుబోతుల తండాకు చెందిన భూక్య జానకిరాం(27) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జానకిరాం విధులకు హాజరయ్యేందుకు శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని బైపాస్‌ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వద్ద లభ్యమైన రూ.లక్ష నగదు, ఐఫోన్‌ను 108 సిబ్బంది పోలీసులకు అప్పగించారు.

మేడారం వెళ్తూ ట్రాలీ ఆటో డ్రైవర్‌..



ట్రాలీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ తరుణ్‌ మృతదేహం

వెంకటాపురం(ఎం) : మండలంలోని లింగాపూర్‌ పరిధిలో గల జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై చల్లా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన లోకిని తరుణ్‌(22) హోటల్‌ సామగ్రితో ట్రాలీ ఆటోలో మేడారానికి వెళ్తున్నాడు.కాగా, మేడారం నుంచి ములుగుకు వస్తున్న స్కార్పియో అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌ తరుణ్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మరో ఇద్దరితో పాటు స్కార్పియో వాహనంలో ఉన్నవారు సైతం గాయపడడంతో అందరిని చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్‌ ఆత్మహత్య



రాజు(ఫైల్‌)

వేలేరు : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ డ్రైవర్‌ ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై డి.హరిత తెలిపిన వివరాలు.. వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు రాజు(42) టిప్పర్‌ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, రాజు ఇటీవలే అప్పులు తీసుకువచ్చి కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. రాజు ప్రవర్తన నచ్చక టిప్పర్‌ యజమాని డ్రైవర్‌ను తొలగించి వేరే వ్యక్తిని నియమించుకున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాజు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మహాముత్తారం : పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలు.. మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన రైతు గంధ్ర కిషన్‌ రావు(32) తన వరిపొలానికి నీళ్లు పెట్టడానికి శనివారం ఉదయం బావి వద్దకు వెళ్లాడు. కాగా కరెంట్‌ మోటార్‌కు విద్యుత్‌ కనెక్షన్‌ ఇస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బెలగవి ఎక్స్‌ప్రెస్‌ పొడిగింపు



కాజీపేట రూరల్‌ : కాజీపేట–బెలగవి మధ్య నడిచే డైలీ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం బెలగవి–భద్రాచలం రోడ్‌ స్టేషన్‌ వరకు పొడిగిస్తున్నట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు.

ప్రత్యేక రైలు వివరాలు..

బెలగవి–భద్రాచలంరోడ్‌ (07335) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 4వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రతి రోజు కాజీపేట జంక్షన్‌కు 7:33 గంటలకు చేరుతుంది. అదేవిధంగా భద్రాచలంరోడ్‌–బెలగవి (07336) ఎక్స్‌ప్రెస్‌ ఈ నెల 5వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ప్రతి రోజు కాజీపేటకు 19:18 గంటలకు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు అప్‌ అండ్‌ డౌన్‌లో డోర్నకల్‌, మహబూబాబాద్‌, కేసముద్రం, వరంగల్‌ స్టేషన్‌లో హాల్టింగ్‌ కల్పించారు.